క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

సంబేపల్లె : నేడు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి చేతులమీదుగా ప్రభుత్వం పెంచిన రూ.3 వేల పింఛన్లను మధ్యాహ్నం 2 గంటలకు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ తెలిపారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

పన్నులు వసూలు చేయండి

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని గృహాలు, దుకాణాలకు సంబంధించిన పన్నులను వసూలు చేయాలని అన్నమయ్య జిల్లా డీఎల్‌పీఓ పార్వతమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సభా భవనంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయం కార్యదర్శి ప్రతి ఇంటికి, దుకాణాల వద్దకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి ఈనెల 31వ తేదీలోపు పన్నులు వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ ఉషారాణి, ఎంపీడీఓ హైదర్‌వలి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బకాయిలను చెల్లించండి

రాయచోటి అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో 12గంటల ధర్నా కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ ఉద్యోగులకు అందవలసిన డీఏ, అరియర్స్, పీఆర్‌సీ, పీఎఫ్ లోన్‌లు, ఏపీజీఎల్ఐ అమౌంట్ తదితరాలు అన్నీ కలిపి రూ. 19వేల కోట్లు బకాయిలను ప్రభుత్వం చెల్లించవలసి ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు శివారెడ్డి, చంద్రశేఖర్, చెంగల్‌రాజు, వెంకటరమణ, వెంకటసుబ్బయ్య, రమణమూర్తి, దావుద్దీన్, అక్రంబాషా తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

సంబేపల్లె : ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌ను సంబేపల్లె ఎంఈఓ శ్రీనివాసులు, జెడ్పీహెచ్ఎస్ సంబేపల్లె హెడ్ మాస్టర్ నరసింహారెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఎస్టీయూ ముందుంటుందని, ఇకపైన కూడా అలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, తిరుపాల్ నాయక్, నాగేశ్వర్ నాయక్, మురళీ, రెడ్డప్ప, దామోదర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, పాపిరెడ్డి, ధనుంజయరెడ్డి, గంగిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోండి




రోగులకు మందులను అందజేస్తున్న వైస్ చైర్మన్ ఫయాజుర్, ఆర్ఐ, వైద్యులు

రాయచోటి అర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్ అన్నారు. బుధవారం పట్టణంలో కొత్తపల్లె యూపీహెచ్‌సీలో, మహబూబ్‌నగర్ పరిధిలోని ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన వార్డు కౌన్సిలర్ అల్తాఫ్, మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జునతో కలసి పరిశీలించారు. జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలంటూ కోరారు. కార్యక్రమంలో వైద్యులు విష్ణు, మహేశ్వరరాజు, లతీఫ్, వసీం అక్రమ్‌తోపాటు వార్డు సచివాలయం కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు, వలంటీర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

గాలివీడు : మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై మండల పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారని ఎస్ఐ వెంకటశివకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మండలంలో కోడి పందెలు, పేకాటరాయుళ్లు, నాటుసారాలపై నిఘా ఉంచామన్నారు. గ్రామ సచివాలయాల్లోని మహిళా పోలీసులు అసాంఘిక కార్యకలాపాల విషయంలో పోలీసులకు సమాచారం అందిస్తున్నారన్నారు. అసాంఘిక కార్యకలాపాల పాల్పడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ఘర్షణలు, అల్లర్లకు పాల్పడేవారిపై, రౌడీ షీటర్లపై పోలీసుల నిఘా ఉందని, గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి సానుకూలంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

మూర్ఛ వ్యాధితో మృతి



తిరుపయ్య (ఫైల్)

ఓబులవారిపల్లె : పెరుమాళ్లపల్లె దళితవాడ గ్రామానికి చెందిన దనాసి తిరుపయ్య(45) మూర్ఛవ్యాధితో బుధవారం మృతి చెందాడు. సాధికారిక బస్సు యాత్రకు రైల్వేకోడూరుకు వెళ్లి తిరిగి బస్సులో వస్తుండగా మార్గమధ్యంలో మూర్ఛ వచ్చి సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పెరుమాళ్లపల్లి దళితవాడకు వెళ్లి తిరుపయ్య మృతదేహాన్ని సందర్శించారు.

కోలాహలంగా బస్సుయాత్ర

రైల్వేకోడూరులో సామాజిక సాధికార బస్సుయాత్ర అశేష జనవాహిని మధ్య సాగింది. కార్యక్రమంలో బాపట్ల ఎంపీ నందిగం సురేష్, నటుడు అలీ, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సారథ్యంలో జరిగిన సమావేశానికి నియోజకవర్గ నలుమూలల నుంచ ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఓబులవారిపల్లె నుంచి ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, పుల్లంపేట నుంచి కొల్లం గంగిరెడ్డి, పెనగలూరు నుంచి కొండూరు అజయ్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాధికార యాత్రకు వచ్చిన వారికి కొల్లం గంగిరెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ముప్పాల హేమనవర్మ, నాగేంద్రలు పసందైన వంటకాలను వడ్డించారు. పట్టణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, డీజేలు, నృత్యాలు, కోలాటాలు, బాణసంచా పేలుళ్లు, కేరళ వాయిద్యాలు అలరించాయి.

– రైల్వేకోడూరు/రైల్వేకోడూరు అర్బన్



పుల్లంపేట: కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో యాత్రకు తరలివెళ్తున్న నాయకులు



మిద్దెపై నుంచి సభను తిలకిస్తున్న యువకులు



డీజేలతో ముందుకు కదులుతున్న కళాకారులు



ర్యాలీగా వస్తున్న కేరళ వాయిద్యా బృందం



బాణసంచా కాల్చుతున్న కార్యకర్తలు



ఓబులవారిపల్లె: సాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో..



పెనగలూరు మండలం నుంచి..



ఆకట్టుకున్న చిన్నారుల కోలాటాలు

నేడు ఎమ్మెల్యే కొరముట్ల రాక

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండలానికి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డిలు నేడు గురువారం రూ.3 వేలు పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు ఎంపీడీఓ వరప్రసాద్ తెలియజేశారు.

స్వార్థప్రయోజనాల కోసమే ఫిరాయింపులు

రాయచోటి టౌన్ : స్వార్థప్రయోజనాల కోసం పార్టీ మారినంత మాత్రన వైఎస్సార్‌సీపీకి నష్టంలేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు సుగవాసి శ్యామ్ స్పష్టం చేశారు. రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ మారిన మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, సి.రామచంద్రయ్యలనుద్దేశించి ఆయన మాట్లాడారు. పదవుల కోసం పార్టీలు మారేవారిని ప్రజలు పట్టించుకోరన్నారు. వ్యక్తిగత లాభాల కోసం ఇరువురు నాయకులు వైఎస్సార్‌సీపీని వీడారని తెలియజేశారు. లాబీయింగ్‌లతో మంత్రి పదవి తెచ్చుకున్న సి. రామచంద్రయ్య ప్రజాక్షేత్రంలో ఏనాడు పోటీ చేయలేదని వాపోయారు. పార్టీ మారిన వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్తుతారన్నారు. రాయచోటిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గడికోట గెలుపును 2024లో ఎవ్వరూ ఆపాలేరని, అలాగే రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవుతారని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాలికలకు విద్యా ప్రదాత సావిత్రిబాయి పూలే



సంబేపల్లె: సావిత్రిబాయి చిత్రపటం వద్ద..



పుల్లంపేటలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సంబేపల్లె : బాలికలకు విద్యా ప్రదాత సావిత్రిబాయి పూలేనని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంబేపల్లె బ్రాంచ్ మేనేజర్ బ్రహ్మణి అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం ఉదయం ప్రధానోపాధ్యాయులు ఎం.నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సంబేపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బ్రహ్మణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆనాటి సమాజపు కట్టుబాట్లను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలైన ఘనత సావిత్రిబాయి పూలేదే అన్నారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని తెలిపారు. సాంఘిక దురాచారాల నిర్మూలనలో ఆమె కృషి ఎనలేనిదన్నారు. అనంతరం ఉపాధ్యాయినులు ఉమాదేవి, సుజాత బాయి, రాపూరి సుజాతలను పూలమాలలతో, దుశ్శాలువాలతో బ్యాంక్ మేనేజర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

సిద్దవటం : మండలంలోని భాకరాపేట, సిద్దవటం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని, చదువుల తల్లి, సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా న్విహించారు. ఈ సందర్భంగా రెండు ఉన్నత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, లక్ష్మీకేశమ్మలు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాకరాపేటలోని హెచ్ఎం లక్ష్మీకేశమ్మను శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, రాధ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్ : తొలిభారత మహిళా ఉపాధ్యాయినిగా మహిళలకు చదువును బోధించిన గొప్ప మనిషి సావిత్రిబాయి పూలే అని భారతీయ అంబేడ్కర్‌సేన (బాస్) రాష్ట్ర కార్యదర్శి తాతయ్య, జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, ఎమ్మార్పీఎస్ నేత రామాంజనేయులు, న్యాయవాది ఈశ్వర్‌లు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చిత్రపటం వారు బాస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బాస్ నేత రామక్రిష్ణ, స్వర్ణకారుల సంఘం నేత అక్బర్ అలీఖాన్, మాల మహానాడు ఈశ్వర్, సూరి, చిన్నమోహన్, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

మహిళా లోకానికే ఆదర్శపాయురాలు సావిత్రిబాయి పూలే అని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న అన్నారు. సావిత్రిబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

పుల్లంపేట : మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ రూత్ మేరి, ఎంఈఓలు నాగా తిరుమలరావు, చక్రధర్ రాజులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయినీలను వారు సన్మానించారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సీఎం జగన్

- వైఎస్సార్ పెన్షన్ రూ.3 వేలకు పెంపు
- ప్రజల ఆర్థిక ప్రగతికే సంక్షేమం
- ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



సిద్దవటం: పెంచిన పెన్షన్‌ను లబ్ధిదారుకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి



ఒంటిమిట్ట: లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా

సిద్దవటం : రాష్ట్రంలో అవ్వాతాతలకు పెన్షన్ విషయంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటను నిలబెట్టుకున్నారని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వం పెంచిన రూ.3 వేలు వైఎస్ఆర్ పెన్షన్ కానుకను మేడా మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వృద్ధులు, పెన్షన్‌దారులు తమ కాళ్ల మీద నిలబడాలనే సంకల్పంతో పెన్షన్ పెంపు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెంచిన పెన్షన్ కానుకను కాకినాడలో నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. సిద్దవటం మండలానికి కొత్తగా 99 మందికి పెన్షన్‌లు మంజూరయ్యాయన్నారు. ప్రజల ఆర్థిక ప్రగతికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న సీఎం జగన్ రాష్ట్రానికి మరోసారి సీఎంను చేసేందుకు ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జగదీష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ డి.లక్ష్మీదేవి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు ఎ.రాజేశ్వరిరెడ్డి, జవహర్‌బాషా, మండల జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, శివయ్య, రమాదేవి, సుబ్బమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవ్వతాతల మోములో చిరునవ్వు కోసమే..

ఒంటిమిట్ట : తనను మనవడిగా భావించి 2019 ఎన్నికల్లో తనను గెలిపించిన అవ్వతాతల మోముల్లో చిరునవ్వు చూడటం కోసమే పెన్షను విడతల వారీగా పెంచుకుంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు రూ.3వేలకు తీసుకొచ్చారన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ గదిలో వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేడా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. మండలంలో కొత్తగా 66 పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. గతంలో పెన్షన్‌లు తీసుకునేందుకు ఆపసోపాలు పడేవాళ్లన్నారు. ఇప్పుడు గడప వద్దకే పింఛన్లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గజ్జల శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీఓ రెడ్డయ్య, తహసీల్దార్ మాధవి లత, కో–ఆప్షన్ మెంబర్ రఫీ, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

6న నందలూరు నుంచి ఒంటిమిట్టకు బైక్ ర్యాలీ

నందలూరు(రాజంపేట) : అయోధ్యలో జనవరి 22వ తేదీన జరగబోవు శ్రీ రామచంద్రుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని జనవరి 6న శనివారం నందలూరులో పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు శోభాయాత్ర నిర్వాహకులు గోపినేని హిమగిరినాథ్ యాదవ్, బూసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చలపాటి నరసింహశెట్టి, ఆర్ముగం విశ్వనాథ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని శ్రీ మారెమ్మ తల్లి ఆలయం నుంచి ఉదయం 9 గంటలకు శోభాయాత్రగా బైక్ ర్యాలీ ప్రారంభించి ఒంటిమిట్ట కోదండ రామాలయం వరకు కొనసాగి అనంతరం స్వామిని దర్శించుకోవడం జరుగుతుందన్నారు. బైక్ ర్యాలీలో పాల్గొన్న భక్తులందరికీ ఒంటిమిట్టలో అన్న ప్రసాదాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో హిందూ బంధువులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విజయుడు, నాయనపల్లి అనుదీప్, జయసింహా, తాటి సుబ్బరాయుడు, నారపుశెట్టి వేణు, ప్రసాద్, చోటానూర్ తదితరులు పాల్గొన్నారు.

అదే విధంగా బైక్ ర్యాలీని పురస్కరించుకొని మండలంలోని పాటూరు నుంచి పొత్తపి వరకు 72 హిందూ దేవాలయాలకు శ్రీరామాంజనేయ ఓంకార కాషాయ ధ్వజాలను నిర్వాహకులు పంపిణీ చేశారు.

గంగమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

లక్కిరెడ్డిపల్లె : మండలంలో వెలసిన గంగమ్మ ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చొరవతో తనవంతు కృషి చేస్తానని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గంగమ్మ ఆలయం ఎదుట రూ. 22.50 లక్షల ఆలయ మిగులు నిధులతో కల్వర్టు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ ఎంపీపీ రెడ్డయ్య, మండల కో–ఆపన్ సభ్యులు సయ్యద్ అమీర్, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, గడ్డం కళ్యాణి, ఉప సర్పంచ్ రాజబాబులతో కలిసి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు గంగమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ రెడ్డయ్య, మాజీ సర్పంచ్, జేసీఎస్ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ శంకర్ నాయుడు, వైఎస్సార్ సిపి నాయకులు జనార్దన్ రెడ్డి, రాయుడు, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీనవర్గాలకు, పేదలకు పెద్దపీట వేస్తున్నామని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం చిన్నమండెం మండలం కొత్తపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రతి గడపను శ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్నింటిలో బీసీలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వివిధ పథకాల ద్వారా సింహభాగం బీసీలు లబ్ధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ భూంసాని అంజలి, లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ శ్యామ్, మాజీ సర్పంచ్ చక్రపాణిరెడ్డి, బీసీ కార్పొరేస్ డైరెక్టర్ రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ చుక్కా అంజనప్ప, సర్పంచులు లోకేశ్వరరెడ్డి, ముసల్‌రెడ్డి, అఫ్రోజ్, నజీర్ అహ్మద్, కళ్లు రమణ, ఎంపీటీసీలు ఏజాస్ అలీఖాన్, వెంకటప్పనాయుడు, రమణ, ఉప సర్పంచ్ పెద్దరెడ్డప్పరెడ్డి, మాజీ సర్పంచ్ అమ్మాజీ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఓర్సు రెడ్డప్ప, శ్రీరాములు, అంజన్‌కుమార్, సాయి, రామమోహన్, చిన్నరెడ్డి, భాస్కర్, అంజి, వెంకటరమణ, టి.రమణ, సంజీవ, వెంకట్రామిరెడ్డి, సురేంద్రరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా పారదర్శక పాలన

సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా పాలన అందుతోందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం చిన్నమండెం మండలం కొత్తపల్లె గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నూతన భవనాల ప్రారంభంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాలు రాష్ట్రాభివృద్ధికి ప్రామాణికాలుగా నిలిచాయన్నారు.

న్యాయవ్యవస్థ గౌరవ బాధ్యత న్యాయవాదులదే




డైరీని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి

రాయచోటి టౌన్ : న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడే బాధ్యత న్యాయవాదులదేనని రాయచోటి జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి అన్నారు. బుధవారం కోర్టు ఆవరణలో భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఆధ్వర్యంలో డైరీలు, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి మూలస్తంభం లాంటి న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడే బాధ్యత న్యాయవాదుల భుజస్కంధాలపై ఉందన్నారు. ఐఏఎల్ వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, జాయింట్ సెక్రటరీ ఎం.ఖాదర్ బాషా, ఐఏఎల్ సభ్యులు షరీఫ్, రాజకుమార్ రాజు, ధనుంజయ్, కుమార్, చిన్నయ్య, ఆనందకుమార్, అజ్మతుల్లా, పి.రెడ్డయ్య, టివి రమణ, రాజ్‌కుమార్, రవిశంకర్, ఆదిరెడ్డి నాయక్, కెఈ రమణ, నిరంజన్, సయ్యద్, ఖీజర్ అలీ, ఆనంద్, ఖుష్బూ, వరలక్ష్మి, శివమ్మ, మహబూబ్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో పుష్కలంగా ఎరువులు

సిద్దవటం : మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రాల్లో పుష్కలంగా ఎరువుల నిల్వలు ఉన్నాయని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి ఆర్బీకేని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతులకు ఆర్బీకే ఛానల్ సబ్‌స్క్రిప్షన్‌ను చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకొని పంట నమోదు చేసుకోవాలన్నారు. కొమ్మనాయినిపల్లి గ్రామంలో పసుపు పంటను పరిశీలించి సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్దపల్లి రైతు భరోసా కేంద్రం సహాయకులు ప్రేమ్‌సందీప్, రైతులు పాల్గొన్నారు.

హెవీ డ్రైవింగ్‌లో ఆర్టీసీ ఉత్తమ శిక్షణ



శిక్షణ పొందిన డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంవీఐ వినోద్

రాజంపేట : హెవీ డ్రైవింగ్‌లో ఆర్టీసీ ఉత్తమ శిక్షణ ఇస్తోందని రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ అన్నారు. బుధవారం రాజంపేట ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో 15వ బ్యాచ్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హెవీ డ్రైవింగ్‌లో శిక్షణ పొందేవారు ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతో శిక్షణలో రాణించాలన్నారు. రాజంపేట డిపో మేనేజర్ రమణయ్య మాట్లాడుతూ రాజంపేట డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకు 14 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో రమణయ్య, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 14వ బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు.

ఆర్థికసాయం

చిట్వేలి : తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆవుల జయమ్మకు రూపానందరెడ్డి ఫౌండేషన్ రూ.50వేలు ఆర్థికసాయం చేసింది. నగదును సాయివికాస్‌రెడ్డి బాధితురాలి కుటుంబసభ్యులకు అందించారు.